పనులు పూర్తయినా బిల్లులు అందడంలేదు

మండల సభలో సర్పంచుల ఆవేదన



సభలో బైఠాయించి నిరసన తెలుపుతున్న పందికుంటపల్లి సర్పంచ్ ఎల్లయ్య

రామడుగు: గ్రామాల్లో పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు అందడంలేదని, దీంతో ఇబ్బందిపడాల్సిన పరిస్థితి వస్తుందని మండలంలోని సర్పంచులు సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో సమావేశ హాల్‌లో ఎంపీపీ కలిగేటి కవిత అధ్యక్షతన మండల సభ నిర్వహించారు. ఎస్ఎఫ్‌సీ నిధులు రాకపోవడంతో పనులు చేపట్టలేని దుస్థితి నెలకొందని, ప్రభుత్వం బిల్లులు చెల్లింపు చేయడంలేదని పలువురు సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో వైకుంఠధామం నిర్మించి ఏడాది పూర్తి కావస్తున్నా నేటికి బిల్లు చెల్లింపు చేయడం లేదని, గ్రామ పంచాయతీ కార్యాలయం కోసం స్థలం కొనుగోలు చేసినా భవన నిర్మించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశ వేదిక ఎదుట పందికుంటపల్లి సర్పంచ్ మొగుళ్ల ఎల్లయ్య బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీపీ కవిత, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి బిల్లులు చెల్లింపు జరిగేలా చూస్తామన్నారు. గ్రామంలో మిషన్‌భగీరథ పైపులైన్లు ధ్వంసమై నీరు రావడంలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారం, నిధుల కోసం ఎంపీడీవో ద్వారా ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని కొక్కెరకుంట సర్పంచ్ ఉమ్మెంతల అభిషేక్‌రెడ్డి కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు నిత్యం తంటాలు పడుతున్నారని, తక్షణం కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ అభిషేక్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. క్రీడా మైదానాలకు పరికరాలు వచ్చాయని, త్వరలో



మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కర్

ఏర్పాటు చేస్తానని ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని మోతె వాగుపై ఆరుచెక్ డ్యాంలు కడితే వరదనీటిలో కొట్టుకుపోయాయని రైతులకు తీరని నష్టం కలిగిందని వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

47 అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న సాంబరాజు

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ ఇంజనీర్ సాంబరాజు 50 అంశాలను చదివి వినిపించగా, 47 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రూ.లక్షతో పట్టణంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు, పారిశుధ్య ట్రాక్టర్ల రిపేర్ రూ. 92,700, చెత్తసేకరణకు వినియోగించే ఆటోల రిపేరుకు రూ.87,720, ఫాగింగ్ మిషిన్ల రిపేర్‌కు రూ. 57,600, విలీన గ్రామాల పంచాయతీ సిబ్బందికి రూ.19,59,927 వేతన బకాయలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. అదే విధంగా పట్టణంలోని ఆరోవార్డు వివేకవర్ధిని స్కూల్ నుంచి గంగోని కుంటకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరలించుటకు రూ. 3,32,902, హిందూశ్మశాన వాటికలో యాష్ లాకర్స్ ఏర్పాటుకు రూ.లక్ష, సద్దుల బతుకమ్మ, దసరా పండుగకు అవసరమైన ఏర్పాట్లకు రూ. 27,50,000లకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య, టీపీవో జ్యోత్స్న, టీపీఎస్ అశ్విని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

చొప్పదండి: పట్టణంలోని ఏడో వార్డులో సోమవారం స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా చేపట్టిన చెత్త తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, కొమురయ్య, శివాణి, హెచ్ఎం రాజిరెడ్డి, పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా సీ సేవలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఇంటి వద్ద పరిశుభ్రత పాటించేలా చూడాలని, మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ రవీందర్‌రావు, ఉపసర్పంచ్ పలువురు పాల్గొన్నారు.



రామడుగు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య

క్లుప్తంగా

భూ కబ్జా చేశారంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వ భూమి కబ్జా చేశారంటూ కాట్రపల్లి సర్పంచ్ కాసగోని నిరోషా సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ రావుల అనిత భర్త వెంకట్ క్రీడా ప్రాంగణానికి సంబంధించి ఎకరం ఐదు గుంటల భూమిని అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని బెదిరిస్తున్నారని ఈవిషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

శంకరపట్నం: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం కేశవపట్నంలో ఆందోళన చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వడ్డిస్తున్నారని, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల సమ్మయ్య అన్నారు. ప్రతినెల రూ.మూడువేల వేతనం, కమీషన్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట సరుకులు అప్పు చేసి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. సమ్మెపై ప్రభుత్వ స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, సహాయ కార్యదర్శి కొండ రజిత, మండల అధ్యక్షురాలు, పద్మ, నాగమ్మ, రాధవ్వ, లక్ష్మీ శంకరమ్మ, స్వరూప పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కారించాలి



వినతిపత్రం ఇస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

శంకరపట్నం: కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుధారాణి, ఎంపీవో ఖాజాబషీరొద్దీన్, పంచాయతీ కార్యదర్శుల సంఘానికి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే చేపట్టబోయే సమ్మెకు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు వెంకటేష్, శ్రీనివాస్, గొడిశాల శ్రీనివాస్, స్రవంతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న యూనియన్ నాయకులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన దేశిని విజయ్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆయన కుటుంబానికి గ్రామంలోని ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు రూ.23,500 అందించారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో పిల్లలు, భార్య శోకసంద్రంలో మునిగిపోయారు. దీంతో ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు కుటుంబానికి బాసటగా నిలిచారు. కార్యక్రమంలో ట్రాక్టర్ ఓనర్ల సంఘం అధ్యక్షుడు కాసర్ల మహేందర్, కార్యదర్శి దరిపెల్లి సంపత్, సభ్యులు సదానందం, వాసుదేవరెడ్డి, భాస్కర్, రమేశ్, రాజు, రవీందర్, రాజయ్య, శ్రీనివాస్, దేవేందర్, సతీశ్, సాయిరాం, సమ్మయ్య, దుడ్డెల రాజు, వినోద్, ప్రశాంత్, శ్రీనివాస్, సమ్మయ్య, రవి, సాయికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మానకొండూర్: గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 2014 ముందు మానకొండూరు నియోజకవర్గం వెనుకబడి ఉండేది ఎమ్మెల్యే అయ్యాక గ్రామాలను అభివృద్ధి చేసినందుకు ఓడిస్తారా అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు లేనిపోని మాటలు చెబుతూ గ్రామాల్లోకి వస్తున్నారు వారి మాటలు నమ్మొద్దన్నారు. సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

తిమ్మాపూర్: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని రేణికుంట గ్రామానికి వివిధ పార్టీల నాయకులు సోమవారం వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో రసమయి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఎంపీపీ వీరారెడ్డి ఆధ్వర్యంలో రేణికుంట నుంచి ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సుమారు రెండు వందల మంది బైక్ ర్యాలీ నిర్వహించారు. డీజే పాటలు, ఎమ్మెల్యే రసమయి నినాదాలతో రాజీవ్ రహదారి నిండిపోయింది. కార్యక్రమంలో రావుల రమేశ్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటల నిల్వతో గిట్టుబాటు ధర



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ మరియదాస్

జమ్మికుంట: రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకొని గిట్టుబాటు ధరకు అమ్ముకొని లాభాలు పొందవచ్చని ఎన్ఐపీహెచ్ఎం (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్) అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మరియదాస్ సూచించారు. సోమవారం కేవీకేలో పంటల నిల్వ పద్ధతులపై రైతులు, వ్యాపారులు, పప్పుమిల్లు యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించిన గోదాముల్లో నిల్వ చేసుకునే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ అరుణ్‌కుమార్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, సస్యరక్షణ శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



గన్నేరువరం: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల, భోగంపాడు, మల్లివానిపల్లి గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఏఓ సంపత్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు అర్జించవచ్చని, పెట్టుబడికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని వివరించారు. ఎంపీడీఓ, ఎంపీవో, సర్పంచులు గురుకుంట్ల సాంబయ్య, జిల్లెల తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న శ్రీనివాస్, రైతుబంధు కో ఆర్డినేటర్ రమేశ్, గ్రామ కార్యదర్శి రాజేశ్, డ్రిప్ ఫీల్డ్ ఆఫీసర్, రైతులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: వ్యవసాయ, ఉద్యానశాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి 25 మంది రైతులను విజ్ఞానయాత్ర నిమిత్తం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆయిల్ ఫీల్డ్ అధికారులు ఆయిల్ పామ్ సాగు వివరాలను రైతులకు క్లుప్తంగా వివరించారు. ఎకరానికి ఏడాదకి రూ.80 వేల నుంచి రూ.లక్ష ఆదాయం వస్తుందని తెలిపారు. కోతులబెడదా లేని పంట అని పేర్కొన్నారు. కచ్చితమైనా మార్కెటింగ్ వసతి కలదని తెలిపారు. విజ్ఞాన యాత్రలో లోహియా కంపెనీ ప్రతినిధి రాజ్ కుమార్ , రైతులు పాల్గొన్నారు

గన్నేరువరం: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలను పొందవచ్చని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి తెలిపారు. సోమవారం మండలంలోని గునుకులకొండాపూర్, మాదాపూర్, పారువెల్ల గ్రామాల్లో ఆయిల్‌పామ్, వివిధ రకాల పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పండ్లతోటల సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పారువెల్లలో ఎనిమిది, గోపాల్‌పూర్, గునుకులకొండాపూర్‌లో ఐదెకరాల్లో పండ్లతోటల సాగుకు దరఖాస్తులు స్వీకరించామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సర్పంచులు మోహన్‌రెడ్డి, కుమ్మరి సంపత్, సహకార సంఘం డైరెక్టర్ బద్దం రాంరెడ్డి, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, సంగు దేవయ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

హుజూరాబాద్: విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా రూ. 5177 కోట్ల పెండింగ్ నిధులు విడుదల చేయాలన్నారు. విద్యారంగాన్ని తుంగలో తొక్కేస్తుందన్నారు. ప్రైవేట్ కళాశాలలు డబ్బులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని వేధిస్తున్నారని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో విద్యార్థుల నుంచి అనేక ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు ఊసేలేదన్నారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అభిలాశ్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

గన్నేరువరం: చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని జంగపల్లి ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17, 14 బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను సర్పంచ్ అటికం శారదతో కలిసి సోమవారం ప్రారంభించారు. జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో ప్రతిభను చాటాలన్నారు. గన్నేరువరం, జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రామకృష్ణా కాలనీ, గుండ్లపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలకు చెందిన 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శారద, సుమలత, పీఈటీలు బాబుశ్రీనివాస్, రాజబాబు, అశోక్, జ్యోతి, జాతీయ స్థాయి క్రీడాకారుడు బుర్ర మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల(బాలుర)లో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి జువేరియా జాహీదా ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 200 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో రోగాలు దూరమవుతాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. మండలంలోని బోర్నపల్లి గ్రామం మహాత్మాజ్యోతిబాపూలే బాలుర హాస్టల్‌ను సోమవారం సందర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడంతోనే గజ్జి వ్యాపిస్తుందన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగపూర్ పల్లె దవాఖాన ఎమ్ఎల్‌హెచ్‌పీ డాక్టర్ కీర్తన, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రఘోత్తమరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకుడు ఎస్.రమేశ్, హాస్టల్ అసిస్టెంట్ ప్రిన్సిపాల్ బి.నరేశ్, ఏఎన్ఎం రాణి, హాస్టల్ హెల్త్ సూపర్‌వైజర్ పవిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ నాయకుల ధర్నా

చిగురుమామిడి: మహిళా రిజర్వేషన్ బిల్లులో లోపాలను సవరించాలని కోరుతూ మండల కేంద్రంలో సోమవారం డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు 90 శాతం ఉపకోటా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాళ్ల నరేశ్, మండల ప్రచార కమిటీ సభ్యులు జిల్లెల్ల నవీన్, సురేశ్, రమేశ్, భూపతి, శ్యామ్, రాజేందర్, మధు, సతీశ్, మహేశ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

సైదాపూర్: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం అన్నారు. మండలంలోని ఆకునూర్‌లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల ముగింపు సమావేశం సోమవారం నిర్వహించారు. అండర్ 17 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఆకునూర్, ద్వితీయ స్థానంలో వెన్నంపల్లి, బాలురలో ప్రథమ స్థానంలో ఎంజేపీ సైదాపూర్, ద్వితీయ స్థానంలో గొడిశాల, అండర్ 14 బాలికల విభాగంలో ప్రథమ ఆకునూర్, ద్వితీయ ఆదర్శ పాఠశాల సోమారం విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడలతో స్నేహభావం, నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని న్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. చదువుతో పాటు క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపాలని సూచించారు. హెచ్ఎం రామస్వామి,ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి వెంకటరెడ్డి, రవిందర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, చంద్రకళ, భూపతి, భాస్కర్, రామలక్ష్మీ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

జమ్మికుంట: సైబర్ నేరాలపై విద్యార్థులకు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట సీఐ బార్పటి రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, షీ టీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనవసరమైన లింక్‌లకు స్పందించకూడదని, సైబర్ మోసగాళ్లు తప్పుదారి పట్టించి ఖాతా నుంచి డబ్బులు కాజేస్తారని అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సైబర్ మోసాలపై కరీంనగర్ పోలీసు కళాబృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, ఎస్ఐ శ్రీధర్, హెడ్‌కానిస్టేబుళ్లు సదయ్య, ప్రవళిక, పద్మ, అధ్యాపకులు ఈశ్వరయ్య, రామ్మోహన్, డాక్టర్ శ్రీలత, మహేందర్‌రావు, రవీందర్, ప్రశాంత్, అరుణ్ రాజ్, సాయి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు విరాళం

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు సోమవారం గ్రామానికి చెందిన సదిశ స్వచ్ఛంద సంస్థ రూ.ఎనిమిది వేలు విరాళంగా అందించారు. సంస్థకు చెందిన సభ్యులు ఈ మేరకు ప్రిన్సిపాల్ లచ్చయ్యకు నగదు అందించారు. గణితంలో ప్రతిభ కనబరిచిన పదోతరగతి విద్యార్థి ముంజాల శ్రావణ్‌కు రూ.రెండువేల ప్రోత్సాహకం అందించారు. సంస్థ వ్యవస్థాపకుడు ముచ్చర్ల గోవర్ధన్‌రెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

- **బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు**

మానకొండూర్: మండలంలోని అన్నారంలో బైక్ అదుపుతప్పి ఓ యువకుడికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రొడ్డ సాగర్ రోడ్డుపై వేగంగా బైక్ నడుపుతూ అదుపుతప్పి డ్రైనేజ్ కాలువలో పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

- **పండిత్ దీన్ దయాల్ జయంతి**

జమ్మికుంట: మండలంలోని కోరపల్లిలో బీజేపీ నాయకులు సోమవారం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు సంపత్‌రావు, తదితరులున్నారు.

ఇల్లందకుంట: బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జయంతి నిర్వహించారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్తగా చేసిన సేవలు మరువలేమన్నారు.

మండపాల్లో ప్రత్యేక పూజలు



దీపారాధన పాల్గొన్న మహిళలు



సాక్షి యూనిట్ కార్యాలయంలో పూజలు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని వినాయక మండపాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. అన్నదానం నిర్వహించారు. తిమ్మాపూర్ 'సాక్షి' యూనిట్ ఆఫీస్‌లో గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. బీఎం వైద శ్రీనివాస్, ఐటీ మేనేజర్ వేణుగోపాల్, యాడ్స్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ప్రొడక్షన్ మేనేజర్ ఓంప్రకాశ్, సర్క్యులేషన్ ఏసీఎం మధుకర్ రెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జీలు ముజఫర్, మహేశ్, సాక్షి టీవీ కరస్పాండెంట్, తిమ్మాపూర్ రిపోర్టర్ రాకేశ్, అకౌంటెంట్ కిశోర్, సిబ్బంది గోపి, రమేశ్, సతీశ్, దామోదర్ పాల్గొన్నారు. ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలోని శ్రీహోమ్స్ కాలనీలో మహిళలు దీపారాధన చేశారు. కార్యక్రమంలో అపర్ణ, మంగ, రాధ, శ్రీలత, శారద, కృష్ణవేణి, యశోద, లక్ష్మి పాల్గొన్నారు. ఆయా గణనాథులను వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన



చొప్పదండి: ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువు వద్ద గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు సోమవారం పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోని 17వ వార్డులో సీసీ రోడ్డు పనులకు చైర్మన్‌భూమి పూజ చేశారు. కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ బార్పటి రమేశ్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో అవగాహన సమావేశం నిర్వహించారు.

చొప్పదండి: పట్టణ శివారులోని కాకతీయ కాలువ వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతికుమార్, సీఐ రవీందర్ పరిశీలించారు. 27న పట్టణంలో గణేశ్ నిమజ్జనం నిర్వహిస్తామని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయం ఎదుట ఎస్సారెస్పీ కాకతీయ కాలువ వద్ద నిమజ్జనం చేస్తామన్నారు.

తిమ్మాపూర్: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేశ్ మండపాల నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ రూరల్ ఏసీపీ తాండ్ర కరుణాకర్‌రావు సూచించారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీకాలనీలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మండపాల నిర్వాహకులతో సర్కిల్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై ప్రమోద్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. డీజేలు వినియోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల వద్ద శ్రుతి మించితే రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండప నిర్వాహకులతో రూరల్ సీఐ కిషోర్, సీఐ రాజ్‌కుమార్ సమావేశమయ్యారు. శాంతియుతంగా తగిన జాగ్రత్తలతో ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు.

పోషణ మాసంపై ప్రతిజ్ఞ



రామడుగు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

చొప్పదండి: మండలంలోని రెవెల్లి గ్రామంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, నార్మల్ డెలివరీలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం పోషణ మాసం పురస్కరించుకొని మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, సర్పంచ్ లింగమ్మ, ఎంపీటీసీ తిరుపతి, సూపర్‌వైజర్ రమాదేవి, డాక్టర్ శ్రీకాంత్, కార్యదర్శి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుధారాణి, జయప్రదలు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే రోగాల బారినపడకుండా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో పోషణ మాసోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వనజ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు వసుమతి, అంజలి, లలిత పాల్గొన్నారు.

- **ముగ్గురిపై కేసు నమోదు**

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురుపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రాధాకృష్ణ సోమవారం తెలిపారు. మున్సిపల్ పరిధి 16 వార్డుకు చెందిన గండికోట నవీన్‌పై అదే వార్డుకు చెందిన పల్లపు సతీశ్, పల్లపు మహేశ్, పల్లపు సాంబశివ అనే ముగ్గురు అన్నదమ్ములు కుటుంబ తగాదలతో దాడికి పాల్పడి చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.